సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

గురువారం : 15 : జూన్ : 2023



రోడ్డుప్రమాదంలో వృద్ధుడి దుర్మరణం
ముద్దనూరు-తాడిపత్రి ప్రధాన రహదారిలో శెట్టి వారిపల్లె గ్రామ సమీపంలో ఇన్నోవా వాహనం ఢీకొనడంతో బైక్‌లో ప్రయాణిస్తున్న వృద్ధుడు దుర్మరణం చెందాడు. -4లో



నష్ట పరిహారం పెంచాలి
నేషనల్ గ్రీన్ ఫీల్డు ఎక్స్‌ప్రెస్ హైవే అనుసంధాన రోడ్డుకు కోల్పోయే భూములకు నష్ట పరిహారం పెంచాలని జమ్మలమడుగు ఆర్డీఓ శ్రీనివాసులును బాధిత రైతులు చుట్టుముట్టారు. - 4లో



హత్య కేసులో నిందితుల అరెస్టు
సింహాద్రిపురం మండలం అంకాలమ్మగూడూరుకు చెందిన జంజాల కృష్ణయ్య హత్య కేసులో ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు పులివెందుల డీఎస్పీ తెలిపారు. - 4లో

న్యూస్‌రీల్

నేడు 'డయల్ యువర్ విద్యుత్ ఎస్ఈ' కార్యక్రమం

కడప కార్పొరేషన్ : విద్యుత్ సమస్యల పరిష్కారానికి గురువారం 'డయల్ యువర్ విద్యుత్ ఎస్ఈ' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు విద్యుత్ శాఖ (ఆపరేషన్) పర్యవేక్షక ఇంజినీరు ఎస్. రమణ ఒక ప్రకటనలో తెలిపారు గురువారం ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకూ వినియోగదారులు 08562-242457 నంబర్‌కు ఫోన్ చేసి తమ సమస్యలు తెలిపి పరిష్కారం పొందవచ్చన్నారు. వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

19 నుంచి వైఎస్ఆర్ ఏఎఫ్‌యూ సెమిస్టర్ పరీక్షలు

ఏఎఫ్‌యూ : కడప నగరంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయంలో ఈనెల 19 నుంచి జూలై 3వ తేదీ వరకు 4వ సెమిస్టర్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు వైస్ చాన్సలర్ ఆచార్య బానోతు అంజనేయప్రసాద్, రిజిస్ట్రార్ ఆచార్య ఇ.సి. సురేంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. స్కూల్ ఆఫ్ ప్లానింగ్‌లోని టౌన్‌ప్లానింగ్, బిల్డింగ్ టెక్నాలజీస్, కన్‌స్ట్రక్షన్ టెక్నాలజీస్ మేనేజ్‌మెంట్, గేమ్ డిజైన్ టెక్నాలజీస్, డిజిటల్ టెక్నిక్స్ ఫర్ డిజైన్ అండ్ ప్లానింగ్, ఇంటీరియర్ డిజైన్ విభాగాల విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వీరితో పాటు కాలేజ్ ఆఫ్ ఫైన్‌ఆర్ట్స్‌లోని పెయింటింగ్, ఫొటోగ్రఫీ, అప్లైడ్ ఆర్ట్, యానిమేషన్, శిల్పం, ఆర్ట్ హిస్టరీ విభాగాలకు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఎంపికైన అభ్యర్థులకు పత్రాలు అందజేత

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ ఆర్టీసీలో కారుణ్య నియామకాలు పొందిన అభ్యర్థులకు బుధవారం రాత్రి నియామక పత్రాలను అందజేశామని ఆర్టీసీ ఆర్ఎం గోపాల్‌రెడ్డి తెలిపారు. శ్రామిక్ ఉద్యోగానికి సంబంధించి ఆరు నెలల నాన్ టెక్నికల్ ట్రైనింగ్‌కు 12 మంది అభ్యర్థులు ఈనెల 15వ తేదీన కర్నూలు జెడ్‌ఎస్‌టీసీ ట్రైనింగ్ కళాశాల ప్రిన్సిపాల్‌కు రిపోర్టు చేయాలన్నారు.

ఏపీఈఏపీసెట్‌లో
మెరిసిన విద్యార్థులు

- జిల్లాను వరించిన ర్యాంకుల పంట
- అగ్రికల్చర్ ఫార్మసీలో 4192 మంది, ఇంజినీరింగ్‌లో 9111 మంది క్వాలిఫైడ్
- అగ్రికల్చర్ ఫార్మసీ, ఇంజినీరింగ్‌లో మెరిసిన పలువురు విద్యార్థులు



వెంకట వినయసింహారెడ్డి



కలవకుంట్ల ప్రణతిరెడ్డి



దుంపల ఫణీంద్రనాథరెడ్డి

కడప ఎడ్యుకేషన్ : ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించి ఏపీ ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కామన్ ఎంట్రన్స్ పరీక్ష(ఏపీఈఏపీ సెట్)- 2023 ఫలితాలు బుధవారం విడుదలయ్యాయి. జిల్లావ్యాప్తంగా మే నెల 15వ తేదీ నుంచి 19వ తేదీ వరకు ఎంపీసీ విభాగానికి, 22, 23 తేదీలలో బైపీసీ స్ట్రీమ్ విద్యార్థులకు జిల్లాలో 9 పరీక్షా కేంద్రాలలో ఆన్‌లైన్ పరీక్షలను నిర్వహించారు. ఇందులో అగ్రికల్చర్ అండ్ ఫార్మసీకి సంబంధించి జిల్లాలో 7739 మంది విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకోగా 5958 మంది ప్రవేశ పరీక్ష రాశారు. వీరిలో 4192 మంది క్వాలిఫైడ్ అయ్యారు. ఇలాగే ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి 13599 మంది రిజిస్ట్రేషన్ చేసుకోగా 12,746 మంది హాజరయ్యారు. అందులో 9111 మంది క్వాలిఫైడ్ అయ్యారు.

అగ్రికల్చర్, ఫార్మసీలో జిల్లా టాపర్స్ వీరే..
అగ్రికల్చర్, ఫార్మసీలో కడప రవీంద్రనగర్‌కు చెందిన వి. వెంకట వినయసింహారెడ్డి 32వ ర్యాంకు సాధించాడు.అలాగే కడప ఎర్రముక్కపల్లెకు చెందిన కవలకుంట్ల ప్రణతిరెడ్డి 45వ ర్యాంకు, వేంపల్లి పుల్లయ్యతోటకు చెందిన పోతిరెడ్డి చంద్రాయుడు 53వ ర్యాంకు, పెద్దనపాడు సర్వరాజపేటకు చెందిన చప్పిడి మణిదీప్ రెడ్డి 56వ ర్యాంకు, కడప పుట్లంపల్లెకు చెందిన పల్లె భార్గవి 66వ ర్యాంకు, ఎర్రగుంట్ల శ్రీరాములపేటకు చెందిన సింగంరెడ్డి వెంకట తేజశ్విని 103వ ర్యాంకు, జమ్మలమడుగు టీచర్స్‌కాలనీకి చెందిన కర్నాటి శివకుమార్‌రెడ్డి 107వ ర్యాంకు, కడప నాగరాజుపేటకు చెందిన దేవిరెడ్డి భృతి 115వ ర్యాంకు, కడప కొప్పోలుకు చెందిన లింగాల శివచరణ్‌రెడ్డి 119వ ర్యాంకు, కడప మారుతినగర్‌కు చెందిన మారెళ్ల గణిత్‌రాయల్‌శ్రీహర్ష 121వ ర్యాంకు సాధించాడు.

ఇంజినీరింగ్ విభాగంలో...
ఇంజినీరింగ్ విభాగంలో రాయచోటి కొత్తపేటకు చెందిన మోడం మనోజ్‌వర్మ 17వ ర్యాంకును సాధించాడు. అలాగే కడప నబీకోటకు చెందిన దుంపల ఫణీంద్రనాథరెడ్డి 25వ ర్యాంకును, వీఎన్‌పల్లె మండలం పాయసంపల్లెకు చెందిన నిమ్మకాయల ధర్మతేజ రెడ్డికి 43వ ర్యాంకు, ప్రొద్దుటూరు శ్రీసాయి రాజేశ్వరి కాలనీకి చెందిన నయకంత నాగభయశ్రీ 67వ ర్యాంకు, కడప చౌటపల్లెకు చెందిన సానేపల్లి లోకేశ్వరరెడ్డికి 71వ ర్యాంకు, ప్రొద్దుటూరు శ్రీనివాసనగర్‌కు చెందిన మద్దెల బోగాది సుశాంత్ 73వ ర్యాంకు, కడప ఏపీ హెచ్‌బీ కాలనీకి చెందిన ఇరగనబోయిన అభిలాష్ 94వ ర్యాంకు, కడప హసనాపురానికి చెందిన కొండ పుష్పకుమార్‌రెడ్డి 102వ ర్యాంకు, చెన్నూరు బయనపల్లెకు చెందిన ఉండేల ఓబుల్‌రెడ్డి 103వ ర్యాంకు, కోడూరుకు చెందిన బొమ్మరెడ్డి గారి నాగ చైతన్యకుమార్‌రెడ్డి 129వ ర్యాంకు సాధించాడు.

ఉపాధి పనులు విస్తృతంగా కల్పించాలి

- అన్నమయ్య డ్యాం బాధిత గ్రామాల్లో పనులు పూర్తి చేయాలి
- నీటి రవాణా బిల్లుల చెల్లింపునకు చర్యలు
- గ్రీన్ అంబాసిడర్లకు వేతనాలు
- జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి



మాట్లాడుతున్న ఆకేపాటి అమరనాథరెడ్డి

కడప సెవెన్‌రోడ్స్ : ప్రజలు తమకు పనులు లేవు..పనులు కల్పించండి...అంటూ ప్రజాప్రతినిధులు, అధికారులను అడిగే పరిస్థితి తలెత్తకుండా గ్రామాల్లో ఉపాధి హామీ పథకం కింద పనులు విస్తృతంగా కల్పించాలని జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం తన చాంబర్‌లో నిర్వహించిన జెడ్పీ స్థాయీ సంఘాల సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి వివిధ అంశాలను సమీక్షించారు. ఉపాధి హామీ పథకంపై జరిగిన చర్చలో ఆయన మాట్లాడుతూ రాజంపేట మండలంలో చాలా మందికి పనులు లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇటీవల తాను ఆ ప్రాంతాల్లో పర్యటించినప్పుడు ఉపాధి పనులు కల్పించాలంటూ ప్రజలు కోరారని పేర్కొన్నారు. జిల్లాలో ఉపాధి కింద చేపట్టిన పనుల గురించి డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ యదుభూషణరెడ్డిని విచారించారు. జిల్లాకు 45 లక్షల పనిదినాలు కేటాయించారని, ఇప్పటిదాక 40,56,000 పనిదినాలు పూర్తి చేశామని చెప్పారు. ఈ నెలాఖరులోపు మిగతా లక్ష్యాలు పూర్తి చేస్తామన్నారు. జలకళ పథకం కింద ఇప్పటికి 750 బోర్లు ఏర్పాటు చేశామని, ఇంకా వేయాల్సి ఉందని డ్వామా పీడీ పోరుమామిళ్ల జెడ్పీటీసీ ముత్యాల చెన్నయ్య అడిగిన ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. అయితే ఈలోపు వివిధ కారణాల వల్ల జలకళ పథకం ఆగిందని, మళ్లీ టెండర్లు పిలుస్తున్నారని వెల్లడించారు. ఖాజీపేట కో ఆప్షన్ సభ్యుడు అచ్చుకట్ల కరీముల్లా మాట్లాడుతూ కేసీ కెనాల్ పూడిక తీత పనులకు ఉపాధి నిధులు ఇవ్వాలని కోరారు. ఎన్‌ఓసీ తీసుకు వస్తే నిధులు ఇస్తామని పీడీ చెప్పారు.

జిల్లాకు రూ. 6.50 కోట్లు తాగునీటి రవాణా బిల్లుల చెల్లింపు కోసం వచ్చాయని అన్నమయ్య జిల్లాలో బిల్లులు త్వరగా అప్‌లోడ్ చేయాలని జెడ్పీ చైర్మన్ ఆదేశించారు. వేసవి సీజన్ వెళ్లి వర్షాలు కురిసే వరకు తాగునీటి సమస్య ఉంటుందని, కనుక ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు క్రియాశీలకంగా పనిచేయాలని జెడ్పీ చైర్మన్ చెప్పారు. గ్రీన్ అంబాసిడర్లకు జీతాలను 15వ ఫైనాన్స్ నిధుల నుంచి విడుదల చేయాలని జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయ ఏఓ ఖాదర్‌బాషాను జెడ్పీ చైర్మన్ ఆదేశించారు. పంచాయతీరాజ్ ఎస్ఈ శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ ప్రయార్టీ బిల్డింగ్స్‌కు ఆలస్యం లేకుండా డబ్బులు చెల్లిస్తున్నామని తెలిపారు. జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి మాట్లాడుతూ అన్నమయ్య ప్రాజెక్టు కింద దెబ్బతిన్న గ్రామాల్లో 90 శాతం పనులు పూర్తి చేశారని తెలిపారు. మిగతా పది శాతం పనులను ఒకటిన్నర సంవత్సరం నుంచి జాప్యం చేస్తున్నారంటూ అసంతృప్తి వ్యక్తం చేశారు. పెనగలూరు జెడ్పీటీసీ సుబ్బరాయుడు, సంబేపల్లె జెడ్పీటీసీ కవిత పలు సమస్యలు ప్రస్తావించారు. జెడ్పీ ఉపాధ్యక్షురాలు శారద, జెడ్పీ సీఈఓ సుధాకర్‌రెడ్డి, డిప్యూటీ సీఈఓ రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగనన్నకు చెబుదాం అర్జీలకు నాణ్యమైన పరిష్కారం

కలెక్టర్ విజయరామరాజు



వీసీలో పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ, జేసీ తదితరులు

కడప సెవెన్‌రోడ్స్ : జగనన్నకు చెబుదాం కార్యక్రమం ద్వారా అందిన ప్రజా సమస్యలకు నాణ్యమైన పరిష్కారం చూపాలని కలెక్టర్ విజయరామరాజు జిల్లా అధికారులను ఆదేశించారు. బుధవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ప్రభుత్వ సంక్షేమ పథకాల లక్ష్యాల సాధనకు ప్రణాళికబద్ధంగా పనిచేయాలని సూచించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని జిల్లాలో సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. ఏక కాల సమయంలోనే ప్రజల నుంచి వినతులు స్వీకరించి ఆమోదయోగ్యమైన అంశాలను పరిగణనలోకి తీసుకుని పరిష్కరించాలని చెప్పారు. ముఖ్యమంత్రి స్వీయ పరిశీలనలో, సీఎంఓ స్థాయి నుంచి నేరుగా సచివాలయాల పరిధిలో పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా స్థానిక ప్రజా ప్రతినిధులను సమన్వయం చేసుకుంటూ ప్రజల చెంతకు వెళ్లి సమస్యలు గుర్తించాలన్నారు. ఈ సమావేశంలో ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్, జేసీ గణేష్ కుమార్, డీఆర్వో గంగాధర్‌గౌడ్, సీపీఓ వెంకట్రావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

అటవీ, వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత
అడవులు, వన్యప్రాణులను సంరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని కలెక్టర్ విజయరామరాజు అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన జిల్లా అటవీ సంరక్షణ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. మొక్కలు అధికంగా నాటాలన్నారు. ఇందు వల్ల వాతావరణ కాలుష్యం, నీటి కొరత లాంటి సమస్యలు పరిష్కారమవుతాయని చెప్పారు. వన్యప్రాణులను సంరక్షించడపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఎర్ర చందనం జాగ్రత్తగా కాపాడాలని చెప్పారు. అటవీ, పోలీసు, రెవెన్యూ యంత్రాంగాలు ఇందుకోసం సమన్వయంతో పనిచేయాలన్నారు. కార్యక్రమంలో జేసీ గణేష్‌కుమార్, డీఎఫ్ఓ సందీప్‌రెడ్డి, అడిషనల్ ఎస్పీ కృష్ణారావు, ఆర్డీఓలు ఇతర అధికారులు పాల్గొన్నారు.

నష్ట పరిహారం పెంచాలి


ఆర్డీఓ శ్రీనివాసులుతో మాట్లాడుతున్న రైతులు

చాపాడు : నేషనల్‌ గ్రీన్‌ ఫీల్డు ఎక్స్‌ప్రెస్‌ హైవే అనుసంధాన రోడ్డుకు కోల్పోయే భూములకు నష్ట పరిహారం పెంచాలని బుధవారం సాయంత్రం జమ్మలమడుగు ఆర్డీఓ శ్రీనివాసులును బాధిత రైతులు చుట్టుముట్టారు. మండలంలోని బద్రిపల్లె, పిచ్చపాడు గ్రామాలకు చెందిన బాధిత రైతులతో బుధవారం ఆర్డీఓ సమావేశం నిర్వహించారు. పిచ్చపాడు ప్రాంతంలో భూములు కోల్పోయే వారికి ఎకరాకు రూ.15లక్షలు నష్ట పరిహారం అందుతుందని ఆర్డీఓ తెలిపారు. నేషనల్‌ హైవే పూర్తిగా కేంద్ర ప్రభుత్వం పరిధిలో ఉందని, నష్ట పరిహారం పెంచటం తమ చేతుల్లో లేదన్నారు. ఈ క్రమంలో రైతులు జోక్యం చేసుకుంటూ.. బహిరంగ మార్కెట్‌లో ఎకరా భూమి రూ.కోటి వరకూ ధర పలుకుతుందని, కేంద్ర ప్రభుత్వం ఇచ్చే పరిహారం ఏ మాత్రం ఆమోదయోగ్యం కాదన్నారు. తమకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆర్డీఓను కోరారు. సమస్యలను అర్జీల రూపంలో అందజేయాలని తమ ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళతానని ఆర్డీఓ రైతులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు సుభానీ, సర్వేయర్‌ స్నేహలత, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఫ్లెక్సీ చించివేతపై కేసు నమోదు

బద్వేలు అర్బన్‌ : స్థానిక నెల్లూరు రోడ్డులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద ఈ నెల 12వ తేదీన ఫ్లెక్సీ చించివేశారని పార్టీ కార్యాలయ సిబ్బంది చంద్ర ఇచ్చిన ఫిర్యాదు మేరకు పలువురిపై కేసు నమోదు చేసినట్లు అర్బన్‌ సీఐ జీ.వెంకటేశ్వర్లు తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటంతో పేదలకు, పెత్తందారులకు మధ్య జరిగే యుద్ధం పేరుతో పార్టీ కార్యాలయం వద్ద గత నెల రోజులుగా ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. ఈ నెల 12న బద్వేలులో జరిగిన యువగళం పాదయాత్రలో పాల్గొన్న నాయకులు ఊరి చివరకు వెళ్లిన తర్వాత పట్టణానికి చెందిన టీఎన్‌ఎస్‌ఎఫ్‌ నాయకులైన జగదీశ్వర్‌రెడ్డి, అమర్‌నాథ్‌రెడ్డిలు మరి కొంత మందితో కలిసి ఏపీ39 కెటి 3999 నెంబరు గల వాహనంలో వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్దకు వచ్చి ఫ్లెక్సీని చించి వేసినట్లు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు జగదీశ్వర్‌రెడ్డి, అమర్‌నాథ్‌రెడ్డి, మరి కొందరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

మనోళ్లు నీట్‌గా రాణించారు

నేషనల్‌ ఎలిజిబిలిటీ ఎంట్రన్స్‌ టెస్ట్‌ (నీట్‌)లో జిల్లా విద్యార్థులు ర్యాంకుల పంట పండించారు. జాతీయస్థాయిలో టాప్‌–100లో 45, 75 వంటి అత్యుత్తమ ర్యాంకులు సాధించారు. వీరితో పాటు పదుల సంఖ్యలో ఉత్తమ ర్యాంకులు పొందటంతోపాటు జాతీయస్థాయిలో రాణించారు. శ్రమకు తగిన ఫలితం దక్కిందంటూ వారి కుటుంబసభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. కాగా ఒకే కుటుంబంలో ఇద్దరు మెడిసిన్‌ సీట్లు సాధించడం విశేషం.

– కడప ఎడ్యుకేషన్‌ / ప్రొద్దుటూరు / చాపాడు/ జమ్మలమడుగు రూరల్‌

న్యూరో సర్జన్‌ కావాలనుకుంటున్నా..



నాన్న, అక్కలను స్ఫూర్తిగా తీసుకుని బాగా చదివా. జాతీయస్థాయి నీట్‌లో 45వ ర్యాంకు సాధించా. న్యూరో సర్జన్‌ చేయడమే నా జీవితాశయం అని కవలకుంట్ల ప్రణతిరెడ్డి పేర్కొంది. కడపకు చెందిన చర్మవ్యాధి వైద్య నిపుణులు నరోత్తమ రెడ్డి, సుజనల కుమార్తె ప్రణతిరెడ్డి నీట్‌లో 720 మార్కులకు 710 మార్కులు సాధించి జాతీయస్థాయిలో 45వ ర్యాంకు కైవసం చేసుకుంది. ప్రణతిరెడ్డి తండ్రి కడపలో ప్రముఖ చర్మవ్యాధి నిపుణులు. అక్క శరణ్య ప్రస్తుతం చెన్నైలోని డీమ్డ్‌ మెడికల్‌ యూనివర్సిటీలో ఎంబీబీఎస్‌ పూర్తి చేసి హౌస్‌ సర్జన్‌ చేస్తుంది. ప్రణతిరెడ్డి 1 నుంచి 10వ తరగతి వరకు కడపలోని నాగార్జున మోడల్‌ స్కూల్లో చదివింది. పదో తరగతిలో 580 మార్కులు సాధించింది. ఇంటర్‌ విజయవాడలోని శ్రీచైతన్యలో చదివి 966 మార్కులు సాధించింది. ప్రణతిరెడ్డి తల్లిదండ్రులు మాట్లాడుతూ 6నుంచి 10వ తరగతి వరకు సంకల్ప కోచింగ్‌ సెంటర్‌ అధినేత వంశీ వద్ద నీట్‌ బేసిక్స్‌లో శిక్షణ తీసుకుందని ఆ బేసిక్స్‌తోనే జాతీయ స్థాయి నీట్‌లో 45వ ర్యాంకు సాధించగలిగిందని తెలిపారు.

వైద్యున్ని కావడమే ఆశయం



వైద్యుడు కావడమే నా ఆశయం అని జాతీయస్థాయి నీట్‌లో 75వ ర్యాంకు సాధించిన వెంకట వినయసింహారెడ్డి అన్నారు.ఇతని తల్లిదండ్రులు హేమలత, ఆది నారాయణరెడ్డిలు కడపలోని కేఎస్‌ఆర్‌ఎం ఇంజినీరింగ్‌ కళాశాలలో ప్రొఫెసర్లుగా పనిచేస్తున్నారు. వెంకట వినయసింహారెడ్డి నీట్‌లో 720 మార్కులకు 710 మార్కులు సాధించి జాతీయస్థాయిలో 75వ ర్యాంకు పొందాడు. ఇతను 1 నుంచి 4వ తరగతి వరకు కడప ఐటీఐ సర్కిల్‌లోని భాష్యంలో, 6 నుంచి 10వ తగరతి వరకు నాగార్జున మోడల్‌ స్కూల్లో చదివాడు.

10వ తరగతిలో 574 మార్కులు సాధించాడు. ఇంటర్‌ను విజయవాడలోని శ్రీ చైతన్య జూనియర్‌ కళాశాలలో చదివి 914 మార్కులు పొందాడు.వెంకట వినయసిహారెడ్డి తల్లితండ్రులు మాట్లాడుతూ సంకల్ప కోచింగ్‌ సెంటర్‌లో 6వ తరగతి నుంచే నీట్‌ బేసిక్స్‌ నేర్చుకోవడం వల్లే నీట్‌లో మా అబ్బాయి సులభంగా ర్యాంకు సాధించాడని తెలిపారు.

డాక్టర్‌నవుతా..



తల్లితండ్రుల కష్టాలను చూశాను. బాగా చదివాను. జాతీయస్థాయి నీట్‌లో 873 ర్యాంకు సాధించానని అబుబకర్‌ సిద్ధిక్‌ తెలిపారు.ఇతని తండ్రి జాకీర్‌హుస్సేన్‌ కడపలో దుస్తులవ్యాపారి, తల్లి హఫీజున్నీషా గృహిణి. నీట్‌లో 720 మార్కులకు 690 మార్కులు సాధించాడు. అబుబకర్‌ సిద్ధిక్‌ 1 నుంచి 10వ తరగతి వరకు కడపలోని నాగార్జున మోడల్‌ స్కూల్లో చదివాడు. 10వ తరగతిలో 9.8 శాతం మార్కులు సాధించాడు. ఇంటర్‌ విజయవాడ శ్రీచైతన్య జూనియర్‌ కళాశాలలో చదివి 890 మార్కులు సాధించాడు. మున్ముందు బాగా చదివి డాక్టర్‌నవుతా. పేదలకు సేవ చేస్తా. తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకువస్తా. వారికి ఆసరాగా నిలబడతా.

– జాతీయస్థాయి నీట్‌లో 873 ర్యాంకు సాధించిన అబుబకర్‌ సిద్ధిక్‌

డీటీ కుమార్తెకు ర్యాంకు



ప్రొద్దుటూరు మండల రెవెన్యూ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తున్న జె.మనోహర్‌రెడ్డి, శివపార్వతిల కుమార్తె చరిత రెడ్డికి ర్యాంకు లభించింది. నీట్‌ పరీక్ష ఫలితాల్లో ఈ విద్యార్థిని 628 మార్కులు సాధించి జాతీయ స్థాయిలో 14,690వ ర్యాంకు సాధించారు. విద్యార్థిని విజయవాడ శ్రీచైతన్య కళాశాలలో ఇంటర్మీడియట్‌ పూర్తి చేశారు.

– జె.చరితరెడ్డి

రైతుబిడ్డకు ఉత్తమ ర్యాంక్‌



ఆల్‌ ఇండియా నీట్‌ ఫలితాలలో మండలంలోని మడూరు గ్రామానికి చెందిన దేవగుడి గురు శేఖర్‌రెడ్డి ఆల్‌ ఇండియా 68 ర్యాంక్‌ సాధించాడు. నీట్‌లో 720 మార్కులకు గాను 710 మార్కులు సాధించాడు. ఇంటర్మీడియట్‌ బైపీసీలో 1000 మార్కులకు 988 మార్కులు సాధించాడు. గురుశేఖర్‌రెడ్డి మడూరు గ్రామంలోని రైతు కుటుంబానికి చెందిన మల్లేశ్వర్‌రెడ్డి కుమారుడు.

– గురుశేఖర్‌రెడ్డి

విద్యార్థి ప్రతిభ



జమ్మలమడుగు పట్టణానికి చెందిన కర్నాటి శివరామిరెడ్డి కుమారుడు కర్నాటి శివరామిరెడ్డి నీట్‌లో జాతీయస్థాయిలో 439 వ ర్యాంక్‌ సాధించాడు. 720 మార్కులకు గాను 695 మార్కులు సాధించాడు. ఇతని తండ్రి శివరామిరెడ్డి పెద్దముడియం మండలంలోని చిదిపిరాళ్ళదిన్నె గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నాడు.

కర్నాటి శివరామిరెడ్డి

ఒకే ఇంట్లో రెండు ర్యాంకులు


15006 ర్యాంకు సాధించిన అద్దంకి శ్రీరామ్‌


21789 ర్యాంకు సాధించిన అద్దంకి లక్ష్మీరాజేశ్వర్‌

కడప నగరం ప్రకాష్‌నగర్‌కు చెందిన అద్దంకి శ్రీనివాసులు, పద్మజ (ఎస్‌.ఎ. హిందీ, చెమ్ముమియాపేట జెడ్పీహెచ్‌ఎస్‌, కడప) దంపతుల కుమారులు ఇద్దరు మెడిసిన్‌ సాధించారు. అద్దంకి శ్రీరామ్‌ 627 మార్కులతో జాతీయస్థాయిలో 15006వ ర్యాంకు, అద్దంకి లక్ష్మీరాజేశ్వర్‌ 613 మార్కులతో జాతీయస్థాయిలో 21789 ర్యాంకు సాధించారు. ఇద్దరు కుమారులు ఉత్తమ ర్యాంకులు సాధించడం పట్ల కుటుంబసభ్యులు సంతోషం వ్యక్తం చేశారు.

కార్డియాలజిస్టునవుతా


గణిత్‌రాయల్‌ శ్రీహర్షకు మిఠాయి తినిపిస్తున్న తల్లిదండ్రులు శ్రీనివాసరావు, వెంకట నాగసుజాత

కార్డియాలజిస్టు కావడమే లక్ష్యమని జాతీయ స్థాయి నీట్‌లో 298వ ర్యాంకు సాధించిన మారెళ్ల గణిత్‌ రాయల్‌ శ్రీహర్ష పేర్కొన్నారు. నీట్‌లో 720 మార్కులకు 700 మార్కులు సాధించాడు. ఇతని తండ్రి శ్రీనివాసరావు పెండ్లిమర్రి మండలం ఎగువపల్లె ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడిగా పనిచేస్తుండగా తల్లి వెంకటనాగసుజాత గృహిణి. శ్రీహర్ష 1 నుంచి 5వ తరగతి వరకు రాజంపేటలోని రాజు స్కూల్లో, 6 నుంచి 10వ తరగతి వరకు కడప నాగార్జున మోడల్‌ స్కూల్లో చదివాడు. 10వ తర గతిలో 575 మార్కులు సాధించాడు. ఇంటర్‌ విజయవాడ శ్రీచైతన్యలో చదివి 965 మార్కులు సాధించాడు.

పేదవారికి సేవచేయడమే లక్ష్యం


తండ్రి వెంకటేశ్వర్లుతో చేతన యాదవ్‌

బాగా చదివి డాక్టర్‌నవుతా. పేదవారికి సేవచేయడమే లక్ష్యమని జాతీయస్థాయి నీట్‌లో 2851 ర్యాంకు సాధించిన చేతన యాదవ్‌ పేర్కొంది. చేతన యాదవ్‌ తల్లితండ్రులు వెంకటేశ్వర్లు బీఎస్‌ఎన్‌ఎల్‌లో సబ్‌ డివిజన్‌ ఇంజినీరింగ్‌ పనిచేస్తుండగా తల్లి సుక్రిత గృహిణి. చేతన నీట్‌లో 720 మార్కులకు 670 మార్కులు సాధించాడు. చేతన 1 నుంచి 3వ తరగతి వరకు హైదరాబాద్‌లోని దిల్‌షుక్‌నగర్‌ పబ్లిక్‌ స్కూల్లో, 4 నుంచి 10వ తరగతి వరకు కడపలోని నాగార్జున మోడల్‌ స్కూల్లో చదివింది. ఇంటర్మీడియట్‌ విజయవాడ చైతన్య కళాశాలలో చదివింది.

రేషన్‌ బియ్యం స్వాధీనం

ఎర్రగుంట్ల : మండల పరిధిలోని వై కోడూరు గ్రామం క్రాస్‌ రోడ్డు వద్ద అక్రమంగా ఆటోలో తరలిస్తున్న రేషన్‌ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. పెద్దనపాడు ఇతర గ్రామాల్లో సుమారు 600 కిలోలు గల 15 బస్తాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్‌ తెలిపారు. ప్రొద్దుటూరుకు చెందిన ఆంజనేయులు, అనంతపురానికి చెందిన ఆదినారాయణలను అరెస్టు చేశామన్నారు. ఆటోను సీజ్‌ చేసినట్లు తెలిపారు.

యువతి ఆత్మహత్య కేసులో ముగ్గురి అరెస్టు

చాపాడు : మండలంలోని పల్లవోలు గ్రామంలో ఈ నెల 6న సాఫ్ట్‌వేర్‌ ఉద్యోగం చేసే యువతి బద్రిపల్లె సురేఖ(23) ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన కేసులో పోలీసులు బుధవారం ముగ్గురిని అరెస్టు చేశారు. కోర్టు ఆదేశాలతో వీరిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ మైనుద్దీన్‌ తెలిపారు. పల్లవోలు గ్రామానికి చెందిన సురేఖ మూడేళ్లుగా గ్రామానికి చెందిన సాఫ్ట్‌వేర్‌ ఉద్యోగి అయిన దోనాది క్రాంతి కుమార్‌ ప్రేమించుకుంటున్నారు. ఇటీవల వివాహం చేసుకుందామని క్రాంతి కుమార్‌ను సురేఖ కోరడంతో ఒప్పుకోలేదు. చచ్చిపో అని బెదిరించగా, వారి కుటుంబీకులతో మాట్లాడి వివాహం జరిపించాలని సురేఖ ప్రాధేయపడగా కులం పేరుతో దూషించారు. దీంతో మనస్థాపం చెందిన సురేఖ లేఖ రాసి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి మరణానికి కారణమైన క్రాంతి కుమార్‌, అతని తల్లి శ్యామల, చిన్నమ్మ విశాలి లను అరెస్టు చేసి మైదుకూరు కోర్టులో హాజరు పరచగా రిమాండ్‌ విధించిందని ఎస్‌ఐ తెలిపారు. ఇదే కేసులో క్రాంతి కుమార్‌ అత్త కూతురు చరితను అరెస్ట్‌ చేయాల్సి ఉందని ఎస్‌ఐ చెప్పారు.

జ్యూస్‌ అనుకుని పురుగుల మందు తాగిన బాలుడు


చాణుక్య (ఫైల్‌)

కురబలకోట : జ్యూస్‌ అనుకుని రెండేళ్ల బాలుడు ఇంట్లోని పురుగుల మందు తాగి తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. ఈ సంఘటన బుధవారం కురబలకోట మండలంలో చోటు చేసుకుంది. మండలంలోని ఎగువబోయపల్లెకు చెందిన కిరణ్‌ పెద్దకుమారుడు చాణుక్య (2) ఇంటిలో ఆడుకుంటూ జ్యూస్‌ అనుకుని పొరపాటున పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్‌ చేశారు.

రోడ్డుప్రమాదంలో వృద్ధుడి దుర్మరణం


గుర్రప్ప మృతదేహం

ముద్దనూరు : ముద్దనూరు–తాడిపత్రి ప్రధాన రహదారిలో శెట్టివారి పల్లె గ్రామ సమీపంలో బుధవారం ఇన్నోవా వాహనం ఢీకొనడంతో బైక్‌లో ప్రయాణిస్తున్న పెద్ద గుర్రప్ప(78) అనే వృద్ధుడు దుర్మరణం చెందాడు. సీఐ నరేష్‌ బాబు కథనం మేరకు శెట్టివారిపల్లెకు చెందిన గుర్రప్ప వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం ముద్దనూరు నుంచి పొలానికి అవసరమైన పురుగుమందులు తీసుకుని స్వగ్రామానికి ద్విచక్రవాహనంలో బయలుదేరాడు. శెట్టివారిపల్లె క్రాస్‌ వద్ద ఎదురుగా తాడిపత్రి వైపు నుంచి వస్తున్న ఇన్నోవా వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో గుర్రప్ప తలకు తీవ్రగాయమైంది. 108 వాహనంలో క్షతగాత్రున్ని ప్రొద్దుటూరుకు తరలించారు. చికిత్స పొందుతూ గుర్రప్ప మరణించాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి


నారాయణరెడ్డి (ఫైల్‌)

వేంపల్లె : వేంపల్లె మండలం అలవలపాడు గ్రామ పొలాల్లో విద్యుదాఘాతంతో రైతు పేరం నారాయణరెడ్డి(53) మృతి చెందాడు. బుధవారం ఈ ఘటన చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పేరం నారాయణరెడ్డి బుధవారం తెల్లవారుజామున పొలంలోకి వెళుతుండగా విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. లోమడ రామాంజనేయులరెడ్డి అనే రైతు అడవి పందులకు తన పొలం చుట్టూ విద్యుత్‌ తీగలు అమర్చారని, అక్కడే తన తండ్రి విద్యుత్‌ షాక్‌కు గురైనట్లు నారాయణరెడ్డి కుమార్తె నాగవేణి అనుమానం వ్యక్తం చేస్తోంది. లోమడ రామాంజనేయులరెడ్డి గమనించి తనపైన కేసు వేస్తారేమోనని భయపడి సమీపంలో ఉన్న విద్యుత్‌ ట్రాన్స్‌ఫార్మర్‌ వద్దకు మృతదేహాన్ని ఈడ్చుకెళ్లి పడేసి ఉంటారని అనుమనిస్తోంది. నారాయణరెడ్డి మృతదేహాన్ని వేంపల్లె ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. మృతుడి కుమార్తె సిద్ధవటం నాగవేణి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రామాపురంలో..


పఠాన్‌ ఖలీద్‌ మృతదేహం

రామాపురం : మండలంలోని నీలకంఠ్రావుపేటకు చెందిన పఠాన్‌ ఖలీద్‌(34) విద్యుదాఘాతంతో మృతి చెందాడు. ఎస్‌ఐ కొండారెడ్డి కథనం మేరకు మండలంలోని పఠాన్‌ ఖలీద్‌ బేల్దారీ పని చేసేవాడు. బుధవారం గ్రామంలోని సయ్యద్‌ ఖాన్‌ ఇంటి నిర్మాణం పనుల కోసం వెళ్లాడు. అక్కడ పనిచేస్తుండగా నాలుగు సంవత్సరాల క్రితం ఇంటిపైన విద్యుత్‌ వైర్‌కు కట్టిన కడ్డీకి విద్యుత్‌ సరఫరా కావడంతో విద్యుత్‌ షాక్‌కు గురై తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం 108వాహనంలో కడప రిమ్స్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వృద్ధురాలు..


లక్షుమ్మ (ఫైల్‌)

రాజుపాళెం : మండలంలోని గాదెగూడూరు గ్రామానికి చెందిన పుత్తా లక్షుమ్మ (75) అనే వృద్ధురాలు బుధవారం గ్రామ సమీపంలోని కేసీ చాపాడు కాలువ వద్ద అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. వివరాలు ఇలా ఉన్నాయి. లక్షుమ్మ బుధవారం ఉదయం కేసీ చాపాడు కాలువ సమీపంలో వేప చెట్టు కింద వేప కాయలు సేకరించేందుకు వెళ్లింది. అక్కడ ఏమి జరిగిందో తెలియదు కానీ లక్షుమ్మ శవమై కనిపించింది. గ్రామస్తులు గమనించి సమాచారాన్ని పోలీసులకు తెలిపారు. సంఘటన స్థలాన్ని ప్రొద్దుటూరు ఏఎస్పీ ప్రేరణాకుమార్‌, జమ్మలమడుగు డీఎస్పీ నాగరాజు, సీఐలు యుగంధర్‌, ఇబ్రహీం, ఎస్‌ఐ రాజగోపాల్‌ పరిశీలించారు. మృతురాలి తల, కుడి కన్నుపై గాయాలు కాగా, కుడి మోచేతి భుజం విరిగినట్లు బంధువులు తెలిపారు. సంఘటన స్థలంలో డాగ్‌ స్క్వాడ్‌తో పోలీసులు తనిఖీ చేశారు. మృతురాలి కొడుకు పుత్తా వెంకటేశు ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాజగోపాల్‌ తెలిపారు. లక్షుమ్మ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రొద్దుటూరు జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. గ్రామ సర్పంచ్‌ పోలా వరలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకుడు పోలా వెంకటరెడ్డి లక్షుమ్మ మృతికి సంతాపం తెలిపారు.

హత్య కేసులో నిందితుల అరెస్టు


మాట్లాడుతున్న పులివెందుల డీఎస్పీ వినోద్‌కుమార్‌, సీఐలు రాజు, బాలమద్దిలేటి

పులివెందుల : పులివెందుల నియోజకవర్గం సింహాద్రిపురం మండలం అంకాలమ్మగూడూరుకు చెందిన జంజాల కృష్ణయ్య హత్య కేసుకు సంబంధించి ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు పులివెందుల డీఎస్పీ వినోద్‌కుమార్‌ పేర్కొన్నారు. బుధవారం స్థానిక అర్బన్‌ పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ వినోద్‌ కుమార్‌ సీఐలు రాజు, బాలమద్దిలేటిలతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పులివెందుల డీఎస్పీ మాట్లాడుతూ కాకర్ల ఉత్తమారెడ్డి, కాకర్ల గౌతమి, కాకర్ల కమలమ్మలను అరెస్టు చేశామన్నారు. అంకాలమ్మ గూడూరు ఎస్సీ కాలనీకి చెందిన కృష్ణయ్య కొడుకు జంజాల అరవింద్‌ బొగ్గుల బట్టీ పెట్టారని.. దీని ఉంచి వచ్చే పొగ వల్ల పిల్లలు ఇబ్బందులు పడుతున్నారని, బొగ్గుల బట్టీని అక్కడ నుంచి తీసివేయాలని కాకర్ల ఉత్తమారెడ్డి భార్య కాకర్ల గౌతమి కృష్ణయ్య, అరవింద్‌లకు చెప్పింది. అయినా బొగ్గుల బట్టీ తీయకపోవడంతో గౌతమి కృష్ణయ్య, అరవింద్‌లను తరుచూ తిడుతుండేదని.. అది భరించలేక కృష్ణయ్య, అరవింద్‌లు కాకర్ల గౌతమిని చెప్పుతో కొట్టి గాయపరిచారన్నారు. అప్పట్లో వీరిపై కేసు కూడా నమోదైందన్నారు. దీనిని అవమానంగా భావించి కాకర్ల ఉత్తమారెడ్డి, కాకర్ల గౌతమి, కాకర్ల కమలమ్మలు జంజాల కృష్ణయ్య, అరవింద్‌ల ఇంటిపైన దాడి చేసి సామగ్రిని కాల్చి వేశారు. దీనిపైన కూడా అప్పట్లో కేసు నమోదైందన్నారు. అనంతరం కృష్ణయ్య, అతని కొడుకు అరవింద్‌లు భయపడి గ్రామం వదిలి వెళ్లిపోయారని.. నెలరోజుల క్రితం కృష్ణయ్య అనారోగ్య కారణాలతో గ్రామంలోకి వస్తానని చెప్పగా.. గ్రామ పెద్దలు ఇద్దరికి కౌన్సెలింగ్‌ ఇచ్చి కృష్ణయ్యను గ్రామంలోకి రానిచ్చారన్నారు. ఈ నేపథ్యంలో కృష్ణయ్య రోజు కాకర్ల ఉత్తమారెడ్డి ఇంటి ముందర తిరుగుతుండటంవల్ల గతంలో జరిగిన సంఘటనలను జీర్ణించుకోలేకపోయారు. పథకం ప్రకారం మంగళవారం కృష్ణయ్య టీ తాగడానికి ఒంటరిగా వెళ్లడాన్ని గమనించి ఇంట్లో నుంచి కాకర్ల ఉత్తమారెడ్డి, కాకర్ల గౌతమి, కాకర్ల కమలమ్మలు కర్రలు తీసుకొని వచ్చి ఒక్కసారిగా అతనిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. గాయపడిన కృష్ణయ్యను 108 వాహనంలో పులివెందుల ప్రభుత్వాసుపత్రికి, అక్కడ నుండి కడప రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడన్నారు.కేసు నమోదు చేసినట్లు పులివెందుల డీఎస్పీ తెలిపారు.

పోలీసు కుటుంబాలపై టీడీపీ ఇన్‌చార్జి వ్యాఖ్యలు సరికాదు


మాట్లాడుతున్న పోలీసు అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు దూలం సురేష్‌

ప్రొద్దుటూరు క్రైం : పోలీసు కుటుంబాలపై ప్రొద్దుటూరు తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు సరికాదని జిల్లా పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు దూలం సురేష్‌ అన్నారు. ప్రొద్దుటూరులోని ప్రెస్‌క్లబ్‌లో బుధవారం సాయంత్రం అసోసియేషన్‌ సభ్యులతో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రవీణ్‌కుమార్‌రెడ్డి పోలీసు అధికారులు, వారి కుటుంబ సభ్యులను ఉద్దేశించి భయభ్రాంతులకు గురి చేసే విధంగా ఇటీవల నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడారన్నారు. ఆయన చేసిన అనుచిత వ్యాఖ్యలు తమను ఎంతగానో బాధించాయన్నారు. విధి నిర్వహణలో భాగంగా ఫిర్యాదులు, కేసులు సర్వ సాధారణమని తెలిపారు. అయితే కుటుంబం అనేది చాలా సున్నితమైన అంశమన్నారు. పోలీసులు నిర్వహించే విధులకు, కుటుంబ సభ్యులకు ఎలాంటి సంబంధం ఉండదని తెలిపారు. పోలీసు కుటుంబ సభ్యులపై వ్యాఖ్యలు చేయడం వారి గౌరవానికి తగదన్నారు. ఇలాంటి వ్యాఖ్యలు చేసిన ప్రవీణ్‌కుమార్‌రెడ్డిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. ఇకపై ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూసుకోవాలన్నారు. ప్రవీణ్‌కుమార్‌రెడ్డి వెంటనే తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని వారు డిమాండు చేశారు. సమావేశంలో అసోసియేషన్‌ రాష్ట్ర, జిల్లా ఉపాధ్యక్షుడు ఉప్పు శంకర్‌, జిల్లా జాయింట్‌ సెక్రటరి ఎన్‌ రఘునాథ్‌రెడ్డి, సభ్యులు సుధాకర్‌, బసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, పుల్లారెడ్డి, పల్లా సుధాకర్‌ పాల్గొన్నారు.

చంపుతానని బెదిరించిన కేసులో నిందితుడికి జైలుశిక్ష

జమ్మలమడుగు రూరల్‌: పొలం తగదా విషయంలో కొట్టి చంపుతానని బెదిరించిన కేసులో నిందితుడికి జమ్మలమడుగు జూనియర్‌ సివిల్‌ కోర్‌ జడ్జి భార్గవి 3 నెలల జైలుశిక్ష, రూ. 500 జరిమానా విధించినట్లు బుధవారం కోర్టు వర్గాలు తెలిపాయి. కోర్టు వర్గాల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పెద్దముడియం మండలం కొండసుంకేసుల గ్రామానికి చెందిన తలారి రమణ, తలారి నడిపి వెంకటేశు, అదే గ్రామానికి చెందిన తిరుమలేశుల మధ్య పంట పొలాల విషయంలో చాలారోజుల నుంచి గొడవలు జరుగుతున్నాయి. ఈ విషయాన్ని మనసులో పెట్టుకుని 04-02-2017న తిరుమలేశు ఇంటి వద్దకు వెళ్లి తలారి రమణ కర్రతో కొట్టాడు.దీంతో గాయపడ్డాడు.అలాగే చిన్న వెంకటేశు కొట్టి తిరుమలేశును చంపుతానని బెదిరించాడు. గాయాల పాలైన తిరుమలేశు అదే రోజు పెద్దముడియం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. బుధవారం జడ్జి భార్గవి కేసును పరిశీలించి తలారి రమణకు 3 నెలల జైలు శిక్ష , 500 రూపాయల జరిమానా విధించినట్లు వారు తెలిపారు.